# విజ్ఞాపన

ఇంటిముందు అతను బైకు ఆపగానే వెనుక కూర్చున్న శిరీష చెంగున దిగి, ముందుకు వచ్చి అతని చేయి అందుకని "బస్ స్టాప్ వరకూ చాలంటే... ఇంటివరకూ లిఫ్ట్ ఇచ్చావ్... థేంక్స్" అంది.

"థేంక్స్ నువ్వెందుకూ చెప్పటం ... నన్నూ నా బండినీ పావనం చేసినందుకు నేనే నీకు చెప్పాలి" చిరునవ్వుతో అన్నాడు.

"పెట్రోల్ ఖర్చు గురించి నీకేం బాధ లేకపోతే .. రోజూ పావనం చేయటానికి నేను రెడీయే... ఆలోచించుకో"... గాలికెగురుతున్న జుట్టును వెనక్కి తోసుకుంటూ పెద్దగా నవ్వింది.

అతను ఒక నిముషం ఆమె వైపు తదేకంగా చూశాడు... "ఈ వైట్ డ్రెస్‌లో తెల్ల గులాబీలా ఉన్న నిన్ను చూస్తోంటే... నీ చిగురాకు పెదవులతో ఓ చిన్నిముద్దు ఇస్తే బావుంటుంది కదా అనే ఆశ కలుగుతోంది" అన్నాడు.

కోపాన్ని అభినయిస్తూ "యూ...." అంటూ కుడిచేయి పైకెత్తిన శిరీష మరుక్షణమే నవ్వేస్తూ అతని చేయిని చనువుగా లాక్కుని అరచేతికి తన పెదవుల్ని ఆనించింది.

కిటికీ దగ్గర నిలబడి వాళ్లను చూస్తూ ఆ మాటల్ని వింటూన్న వసుంధర నిశ్చేష్టురాలైంది. అతనికి 'బై' చెప్పి లోపలకు వచ్చిన కూతురి వేపు కోపంగా చూస్తూ "బైకు మీద అతని వెనుక కూర్చుని రావటమే కాకుండా ఆ మాటలూ, నవ్వులూ ఏమిటీ? అంది.

"అతను లిఫ్ట్ కావాలా అనడిగితే – బస్టాప్ వరకూ చాలని అన్నా కూడా ఇంటి వరకూ తీసుకు వచ్చేశాడు. పెట్రోల్ ఖర్చు గురించి అతనికేం బాధ లేనపుడు సౌకర్యంగా రావటానికి నాకు అభ్యంతరం ఎందుకూ? ఒకమ్మాయి లిఫ్ట్ కావాలా అనడిగితే... ఏ అబ్బాయైనా 'నో' అంటాడా? అనడు కదా! అలాంటపుడు అమ్మాయిలు మాత్రం అబ్బాయిలిచ్చే ఆఫర్‌ని ఎందుకు ఉపయోగించుకోకూడదూ? ఈ రోజుల్లో ఆడ, మగ అంటూ తేడాల్లేవు... అందరిదీ ఒకటే పద్ధతి. అతను నా ఫ్రెండ్. అతనితో క్లోజ్‌గా మూవ్ అవటంలో విడ్డూరం ఏం ఉందీ?" నిర్లక్ష్యంగా చూస్తూ జవాబు చెప్పింది.

"ఫ్రెండయితే లోపలకు రమ్మని కాసేపు కబుర్లు చెప్పుకుని కప్పు కాఫీ ఇచ్చి పంపించాలి. అంతే తప్ప మితిమీరిన చనువు ఇవ్వకూడదు... తీసుకోకూడదు. అల్లుడుగానీ చూసివుంటే..."

తల్లి మాటలకు మధ్యలోనే అడ్డం వచ్చి "ఏమవుతుందేం...? నా లైఫ్‌స్టైల్ గురించి తెలుసుకుంటాడు. నచ్చకపోతే విడాకులు తీసుకుని తనకి నచ్చినవాళ్ళతో కలిసి ఉంటాడు. నేనూ అదే పని చేస్తాను. ఇందులో ప్రోబ్లెం ఏం ఉందీ! నేను ఎవరి కోసమూ నా స్వేచ్ఛని మాత్రం వదులుకోను" అంది.

"శి...రీ...షా" గట్టిగా అరిచింది.

"ఏమిటమ్మా ... ఎందుకంత గట్టిగా అరిచావ్? కలేమైనా వచ్చిందా?" తల్లిని కుదుపుతూ అడిగింది శిరీష. వసుంధరకు మెలకువ వచ్చి కళ్ళు తెరిచి చూసి స్థిమితపడింది. గ్లాసుతో మంచినీళ్లు తెచ్చి అందించి "పీడకలేమైనా వచ్చిందామ్మా" అనడిగిన శిరీషకు "అవును.. ఏదో పిచ్చికలలే.. నువ్వు పడుకో" అని చెప్పి మంచినీళ్ళు తాగి ఒక పక్కకు తిరిగి పడుకుంది. ఆ రోజు జరిగిందంతా గుర్తుకు తెచ్చుకుంది.

✤ ✤ ✤

ఢిల్లీలోని మహిళామండలి వాళ్ళు ఏ రంగంలో అయినా సేవ చేసిన ఓ ప్రముఖ వ్యక్తికి ప్రతి సంవత్సరం అవార్డు ప్రకటించి సన్మానం చేస్తుంటారు. ఈ సంవత్సరం ఆ అవార్డు వసుంధరాదేవికి లభించింది. వివిధ పత్రికలలో స్త్రీల సమస్యల గురించి వ్యాసాలెన్నో రాసి స్త్రీవాద రచయిత్రిగా గుర్తింపు తెచ్చుకోవటమే కాకుండా, అన్యాయానికి గురయిన స్త్రీల తరపున నిలబడి, సంబంధిత వ్యక్తులతో పోరాడి, వాళ్ళకి న్యాయం లభించేట్లుగా చేసిన ఖ్యాతి ఆమెకుంది.

సన్మానం జరిగే రోజు ఆమె భర్త రఘురామ్‌కి ముఖ్యమైన పని ఉండటం వలన వసుంధర ఒక్కతే బయలు దేరింది. దారిలో హైద్రాబాద్‌లో కూతురి ఇంట్లో ఒకరోజు ఆగి వెళ్ళేట్లుగా ప్రయాణం ప్లాను చేసుకుంది. స్టేషనుకు దగ్గరలో ఉంటున్న ఆమె స్నేహితురాలు సుభద్ర రిసీవ్ చేసుకుని శిరీష ఇంటికి తీసుకువెళ్ళింది.

భర్త ఆఫీసు పనిమీద క్యాంప్‌కి వెళ్ళటంతో ఆ ఆదివారంనాడు సరదాగా కాలక్షేపం చేద్దామని సెలవు మీద అమెరికా నుండి వచ్చిన ఫ్రెండ్ రజనితోపాటు మరికొంతమంది అమ్మాయిల్ని శిరీష తన ఇంటికి పిలిచింది.

వసుంధర, సుభద్ర వచ్చేసరికి శిరీషా వాళ్ళంతా హాల్లోనే కూర్చుని సినిమా ఏదో చూస్తూ గోలగోలగా మాట్లాడుకుంటున్నారు. కుశల ప్రశ్నలయ్యాక వీళ్ళిద్దరూ కూడా కాఫీ తాగుతూ ఆ హాల్లోనే ఒక పక్కగా కూర్చున్నారు.

వాళ్ళు చూస్తున్న సినిమాలో ... హీరోయిన్ బజారులో తారసపడిన ఓ వ్యక్తిని భర్తకు పరిచయం చేసి, అతనిని పెళ్ళికి ముందు ప్రేమించాననీ అనుకోని పరిస్థితుల్లో దూరమయ్యామనీ తమ కొడుకుగా పెరుగుతున్న వాడికి అతనే తండ్రనీ చెబుతుంది. అపుడు ఆ భర్త ప్రేమకు మరణం లేదంటూ వాళ్ళిద్దరి చేతులూ కలిపేసి, తాను ప్రేమిస్తోన్న మరో అమ్మాయితో సెటిలైపోతానని చెబుతాడు.

“ఎంత సినిమా అయితే మాత్రం అదేదో చాలా మామూలు విషయం అన్నట్లుగా భార్యను ఆమె ప్రియుడి చేతుల్లో పెట్టడం ఏం బాగాలేదని” ఒకరంటే, “ఏం ... అందులో తప్పేం ఉందీ, అనవసరమైన సెంటిమెంట్లు లేకుండా అలా నచ్చినవాళ్ళతో సెటిలైపోవటం బాగానే ఉంటుందిలే” అని ఇంకొకరు నవ్వుతూ అన్నారు.

“సినిమాల్లోనే ఇలా చూపిస్తున్నారా... లేక బయట కూడా మనవాళ్ళింత ప్రోగ్రెస్ అయ్యారా?” అమెరికా నుండి చాలా సంవత్సరాలకు ఇండియా వచ్చిన రజని అడిగింది.

“అంతలేదుగానీ... సిటీల్లో కొంతమంది అమ్మాయిలు బాగానే ఫాస్ట్ అయ్యారు. అబ్బాయిలతో సమానంగా క్లబ్బుల్లో పబ్బుల్లో అర్ధరాత్రి వరకూ ఎంజాయ్ చేస్తున్నారు” అని ఒకమ్మాయి సమాధానం చెబితే, ఇంకొక అమ్మాయి నవ్వుతూ – “సినిమాల్లో అమ్మాయిల పరిస్థితి కొంత వెనకబడే ఉంది... హీరోలతో సమానంగా లేదు. రెండో పెళ్ళి నేరమే అయినా కొన్ని సినిమాల్లో హీరోకయితే మినహాయింపు ఉంది. తనని ప్రేమించిన ఇద్దరు హీరోయిన్ల భుజాల మీదా హీరో చేతులు వేసి అలా సెటిలైపోయినట్లుగా శుభం కార్డు వేస్తున్నారు. తనని ప్రేమించిన ఇద్దరు హీరోలతోనూ హీరోయిన్ అలా సెటిలైనట్లుగా మాత్రం చూపించటం లేదు. ఈ సినిమా చూస్తోంటే మాత్రం ఇక అలాంటి సీన్లూ సినిమాల్లో వస్తాయనే అనిపిస్తోంది” అంది.

“అనిపించడం కాదు, రావాలి! వస్తాయి. అసలందులో తప్పేముంది? మగవాళ్ళు చేసే ఏ పనైనా ఆడవాళ్ళూ చేయొచ్చు. మగవాళ్ళు చేసే తప్పుని పట్టించుకోని సమాజం ఆడవాళ్ళపట్లా అదే ధోరణి అనుసరించాలి. మగవాళ్లకో న్యాయం, ఆడవాళ్లకో న్యాయం ఉండకూడదు” బల్లగుద్ది చెబుతున్నట్లుగా గట్టిగా ఒకమ్మాయి అనగానే “అవును... నిజమే...” అంటూ ఇద్దరు ముగ్గురు అమ్మాయిలు సమర్థించారు.

రజని నవ్వుతూ "మొన్న ఏం జరిగిందో చెప్పనా" అంటూ మొదలు పెట్టింది.

"న్యూస్ పేపరులో చనిపోయినవాళ్ల ఫోటో వేసి క్రింద శ్రద్ధాంజలి ఘటిస్తున్న కుటుంబ సభ్యుల పేర్లు వేస్తూంటారుగా ... అలాగే ఒకాయన ఫోటో వేసి కింద కొడుకులు, కోడళ్ళు అంటూ హెడ్డింగులు పెట్టి, అటు ఇద్దరి పేర్లూ ఇటు ఇద్దరి పేర్లూ రాశారు. ఆ తరువాత కూతురు హెడ్డింగు కింద ఒకమ్మాయి పేరు వేసి, పక్కన అల్లుళ్లు అంటూ ఇద్దరి పేర్లు వేశారు. నాకు అర్థం కాలేదు. 'అమెరికాలోనే ఇలాంటి పరిస్థితి లేదు. ఇక్కడ ఇంత ఎడ్వాన్స్ అయ్యారా?' అని అమ్మనడిగితే 'పిచ్చి జోకులెయ్యకు' అంటూ కోప్పడి 'ఒకమ్మాయి చనిపోయి ఉంటుందిలే' అంది. ఆ పాయింట్ నాకు తట్టలేదు మరి" అంది.

అందరూ పెద్దగా నవ్వారు.

వాళ్ళందరి కబుర్లు వింటూనే వసుంధరతో మాట్లాడుతోన్న సుభద్ర శిరీష వేపు చూస్తూ "శిరీషా... ఆమధ్య నువ్వు మా ఇంటికి వచ్చినపుడు, మా రెండోవాడు తరుణ్‌తో చెస్ ఆడుతున్నవాడి క్లాస్‌మేట్ గిరీష్‌తో మాట్లాడావుగా... ఆ అబ్బాయి గుర్తున్నాడా?" అనడిగింది.

"గుర్తులేకేం ఆంటీ... క్లాసులో అతనే ఫస్ట్ వస్తూంటాడని తరుణ్ చెప్పాడు. చాలా చురుకైన అబ్బాయి. ఇంటర్ ఎగ్జామ్స్ అయ్యాయిగా... ఎంసెట్‌కి ప్రిపేరవుతున్నాడా?" అంది శిరీష.

సుభద్ర గట్టిగా నిట్టూర్చింది. "పదిహేను రోజుల క్రితం ఫాన్‌కి ఉరి వేసుకుని చనిపోయాడు! టెన్త్ చదువుతోన్న చెల్లెలికి ట్యూషన్ చెప్పటానికని వాళ్ళింటికి వచ్చే అతనితో తల్లికి ఏర్పడిన సాన్నిహిత్యాన్ని తెలుసుకుని, ఆ నిజాన్ని భరించలేక పాపం ప్రాణాలు తీసుకున్నాడు. మరునాడే ఆ అబ్బాయి తండ్రి ఎటో వెళ్లిపోయాడు. ప్రాణాలు తీసుకున్నాడో ఏమయ్యాడో ఇప్పటివరకూ తెలియలేదు. ఆ కుటుంబం పరిస్థితి చిందరవందర అయిపోయింది. తండ్రికే గనుక మరో అమ్మాయితో అలాంటి స్నేహం ఉండి ఉంటే, ఆ నిజం తెలిసినా ఆ అబ్బాయి బాధ పడేవాడేకానీ, ప్రాణాలు తీసుకోవాలనిపించేంతగా తలకిందులయ్యేవాడు కాదని నా నమ్మకం".

సుభద్ర ఆ చివరి ఆక్యం ఎందుకు చెప్పిందో అర్థమైందన్నట్లుగా ఒకమ్మాయి ఆవేశంగా అంది – "చూశారా .. ఆడవాళ్ళూ మగవాళ్ళూ అన్ని విషయాలలో సమానమని అంటారు కానీ మగవాళ్ళ తప్పుకి ఒకలా. ... ఆడవాళ్ళ తప్పుకి ఒకలా స్పందిస్తారు. ఆడవాళ్ళకో న్యాయం, మగవాళ్లకో న్యాయం ఎందుకుండాలి? అందరూ సమానమనే దృష్టిని మనం పిల్లలకూ అలవరచాలి. ఇప్పటి కాలాన్ని బట్టి విలువలూ మారాయని తెలియజెప్పాలి".

ఇంకొక అమ్మాయి అంతే ఆవేశంతో వసుంధరతో అంది "ఆంటీ... ఢిల్లీలో మీకు సన్మానం జరిగాక సభలో మీ స్పీచ్ ఉంటుందిగా... అపుడు మీరు ఈ పాయింటు గురించి తప్పకుండా మాట్లాడాలి. ఆ వేదిక నుండి మీరు చెప్పే విషయాలకు ఒక విలువ, ప్రాధాన్యతా

ఉంటాయి. ఆ ప్రసంగ సారాంశం అన్నిపేపర్లలో వస్తుంది కాబట్టి అందరికీ తెలుస్తుంది.... పబ్లిసిటీ వస్తుంది. పాత రోజులు పోయాయనీ మగవాళ్ళకో న్యాయం, ఆడవాళ్లకో న్యాయం లేదనీ ... మగవాళ్లకు తప్పుకానిది ఏదైనా ఆడవాళ్ళకూ తప్పుకాదనీ మీరు గట్టిగా మాట్లాడాలి".

వసుంధర సాలోచనగా తల పంకించింది. అంతలోనే వాళ్ళందరి మాటలు మళ్ళీ ఆ సినిమా మీదకు మళ్ళాయి. వాళ్ళందరూ నవ్వుకుంటూ గోలగోలగా మాట్లాడుకుంటూంటే, సుభద్ర "వెళ్ళొస్తానిక" అంటూ బయలుదేరింది.

రాత్రి నిద్రపోయేముందు వాళ్ళ మాటల్ని తలచుకున్నందువల్లే తనకలాంటి కల వచ్చింది కాబోలనుకుంటూ వసుంధర మళ్ళీ నిద్రకుపక్రమించింది.

✣ ✣ ✣

ఆ మరునాడు ...

కంపార్ట్‌మెంట్‌లో లగేజి సర్ది, ట్రైను బయలుదేరిటానికింకా టైము ఉందని వసుంధర, శిరీషా ప్లాట్‌ఫాం మీద నిలబడ్డారు.

అంతలోనే బిలబిలమంటూ పదీపదిహేను మందికి పైగా ఉన్న అమ్మాయిల గుంపు వచ్చి వసుంధరను విష్ చేస్తూ బొకేలు అందించారు. వాళ్ళలో శిరీష వాళ్ళ ఆఫీసులో పనిచేసే అమ్మాయిలు, ముందురోజు ఇంటికి వచ్చిన శిరీష ఫ్రెండ్స్ కూడా ఉన్నారు.

ఒకమ్మాయి "ఆంటీ ... మరిచిపోకండి .. నిన్న మేం చెప్పిన పాయింట్ గురించి మీరు మాట్లాడాలి" అని గుర్తు చేయగానే ఇద్దరు ముగ్గురు వెంటనే కోరస్‌గా "అవునండీ .. మాట్లాడాలి" అన్నారు.

ఆ క్షణం వసుంధరకు వాళ్ళు పదీపదిహేనుమందిలా కనిపించలేదు... వందలూ వేల సంఖ్యలో ఉన్నట్లుగా అనిపించారు. వాళ్ళందరూ కూడా ఆ మాటల్నే నొక్కి వక్కాణిస్తున్నట్లుగా అనిపించి వసుంధరలో ఒక్కసారిగా ఆవేశం పొంగి వచ్చింది. వెంటనే సంబాళించుకుని నెమ్మదిగా వాళ్ళకు చెప్పింది.

"మీరు చెప్పినట్లుగా మహిళామండలి వేదిక నుండి మారిన విలువల గురించి మాట్లాడాలని నేనూ నిర్ణయించుకున్నాను. అక్కడ నేను చెప్పేది ముందుగా మీకు నాలుగు మాటల్లో చెబుతా... వినండి. ఆరోగ్యకరమైన జీవనానికీ సమాజ శ్రేయస్సుకూ మనం కుటుంబ వ్యవస్థనూ నీతి నియమాలనూ ఏర్పరచుకున్నాం. కలిసి బతకలేని సమస్యలూ పరిస్థితులూ ఉంటే విడాకులు తీసుకోవటం మంచిదేకానీ... కలిసి ఉన్నపుడు మాత్రం భార్యాభర్తలు పరస్పరం నిజాయితీగా ఉండాల్సిన అవసరం ఉంది. అన్యోన్యంగా ఉండే తల్లిదండ్రుల పిల్లలు ఎటువంటి ఒత్తిడీ లేకుండా ఆనందంగా మానసిక ఆరోగ్యంతో పెరుగుతారు.... సమాజంలో మంచి పౌరులవుతారు. తల్లిదండ్రుల నడవడీ, ఆలోచనలూ అన్నీ పిల్లలపై ప్రభావం చూపిస్తాయి. తల్లిప్రభావం పిల్లలపై మరింతగా ఉంటుంది.

వ్యసనాలకు బానిసలవటం వల్లనో... మరొకరి ఆకర్షణలో పడినందువల్లనో కుటుంబాన్నీ కన్న పిల్లల్నీ నిర్లక్ష్యం చేసే మగవాళ్ళు కొందరయినా ఉంటారుగానీ, పిల్లల బాధ్యతను కాదనుకునే ఆడవాళ్లు మాత్రం అరుదే! ఆ మమకారం ప్రతీ స్త్రీకీ మాతృత్వంతో అలవడే సహజ లక్షణం. ఆ ప్రత్యేకతే స్త్రీని మగవాడికంటే భిన్నంగా, మిన్నగా నిలబెడుతోంది! తప్పుదారిలో ఎవరు నడిచినా అది తప్పే అవుతుంది. ఆడవాళ్లకు మాత్రమే కాదు, మగవాళ్ళకూ శీలం అవసరమే అని వాదించండి. తప్పుదారి పట్టినవాళ్ళని మందలించండి.. హెచ్చరించండి. అంతేకానీ వాళ్లకి లేని నీతి నియమాలు మాకు మాత్రం ఎందుకని ప్రశ్నించకండి. అలాంటి భావాలను వెలిబుచ్చటం కూడ తప్పే అవుతుంది. అవి రోగకారక క్రిముల్లా వ్యాప్తి చెంది కొంతమంది అమాయకుల మనసులనైనా కలుషితం చేసే ప్రమాదం ఉంది మరి!

మీ తరం అమ్మాయిలందరికీ నేను చేస్తున్న విజ్ఞప్తి ఏమిటంటే.. మీ ప్రత్యేకతల్ని వదులుకోవటానికి సిద్ధంకాకండి. అదే సమయంలో స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు వక్రభాష్యం చెప్పుకోకండి, మగవాళ్ళతో మీరు అన్నింటిలో సమానమే! వాళ్ళకున్న అన్ని హక్కులూ మీకూ ఉండితీరాలి... నిజమే! కానీ చెడిపోవటంలోనూ సమాన హక్కుల్ని మాత్రం కోరకండి... ఆ పోటీ మీకొద్దు".

ఎంతో ఉద్వేగంతో మాట్లాడిన ఆమె కంఠం చివరకు వచ్చేసరికి అర్థిస్తున్నట్లుగా ఆర్ద్రంగా మారిపోయింది.

ఆమె మాటల్ని విన్న అమ్మాయిలందరూ అవాక్కయి ఒక క్షణం అలాగే చూస్తూండిపోయారు.

తరవాత ఆమాటల్ని అంగీకరిస్తున్నట్లుగా తలలూపి, కంపార్ట్‌మెంట్ వైపు అడుగులు వేస్తున్న ఆమెకు చేతులూపుతూ చిరునవ్వులతో వీడ్కోలు పలికారు.

ఈనాడు ఆదివారం. 14, మే 2006